

ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేసి, తరలిస్తున్న పోలీసులు

## అసెంబ్లీకి వెళ్లకుండా..

చట్టసభల్లో జనం గొంతుక వినిపించే ప్రతిపక్ష ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అక్రమంగా అరెస్టు చేసింది. ఈ నెల 9 నుంచి మొదలైన అసెంబ్లీ శీతాకాల సమావేశాల్లో భాగంగా సభకు హాజరయ్యేందుకు వెళ్లిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు దౌర్జన్యంగా నిర్బంధించారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలపై ప్రశ్నించేందుకు సిద్ధమైన బీఆర్ఎస్ నేతలను అసెంబ్లీ బయటే అడ్డుకున్నారు. గతంలో ఎన్నడూ ఈ తరహాలో నిర్బంధాలు జరుగలేదు. సభా వ్యవహారాలకు అడ్డు పడితే సస్పెండ్ చేయడం సాధారణం కానీ, సభలోకి అడుగు పెట్టకుండానే అడ్డుకోవడం విమర్శలకు తావిచ్చింది. మరోవైపు, అసెంబ్లీకి వస్తే ప్రజా సమస్యలపై చర్చిద్దామని సవాల్ చేస్తున్న రేవంత్‌రెడ్డి.. ప్రతిపక్ష నేతలను అసెంబ్లీలోకి అడుగు పెట్టకుండా నిర్బంధించిన వైనంపై జోరుగా చర్చ జరుగుతున్నది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



అసెంబ్లీ ఎదుట మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డిని అరెస్టు చేస్తున్న పోలీసులు

# నియంతృత్వ పాలన

- అడుగడుగునా ఆంక్షలు, నిర్బంధాలు
- రాష్ట్రంలో రాజ్యాంగ విరుద్ధ పాలన
- ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల అక్రమ అరెస్టు
- చట్టసభల్లోకి వెళ్లకుండా అడ్డగింత
- మాజీ సర్పంచుల నిర్బంధం
- నిరంకుశంగా వ్యవహరిస్తున్న రేవంత్ సర్కారు

నిజామాబాద్, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రేవంత్ సర్కారు నియంతృత్వ పోకడలకు పోతున్నది. అక్రమ నిర్బంధాలు, అరెస్టులతో నిరంకుశ పాలన కొనసాగిస్తున్నది. ప్రజల ఓట్లతో గెలిచిన ప్రజాప్రతినిధులను చట్టసభల్లోకి వెళ్లకుండా సోమవారం అడ్డుకున్నది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మాజీ సర్పంచులను అక్రమంగా అరెస్టు చేయించి ఠాణాల్లో నిర్బంధించింది. ప్రజాపాలన పేరు చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ.. అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న తీరుపై జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## ప్రజాగొంతుకపై ఉక్కుపాదం..

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొత్తలో ప్రజాస్వామ్యమని, ప్రజా పాలన అని ఊదరగొట్టింది. తీరా చూస్తే కనీసం శాంతియుత నిరసనలు చేపట్టే అవకాశం లేకుండా చేసింది. ఎన్నికల్లో ఓడిపోయిన కాంగ్రెస్ నేతలే అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనడం, వారికే ప్రభుత్వ యంత్రాంగం వత్తాసు పలకడం దగ్గరి నుంచి మొదలు పెడితే చట్టసభల్లోకి అడుగు పెట్టనీయకుండా ప్రతిపక్ష ఎమ్మెల్యేలను నిర్బంధించడం వరకు సర్కారు నిరంకుశత్వానికి చక్కటి ఉదాహరణ. మరోవైపు, బీఆర్ఎస్ నేతలను అడ్డగించిన ప్రభుత్వం.. బీజేపీ ఎమ్మెల్యేలను మాత్రం సభలోకి అనుమతించడం గమనార్హం. పైగా అసెంబ్లీలో మైక్ ఇచ్చి ఇష్టారీతిన మాట్లాడేందుకు అవకాశం కల్పించింది. బీజేపీ ఎమ్మెల్యేల పట్ల ఒకరకంగా, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులతో మరో విధంగా కాంగ్రెస్ సర్కారు వ్యవహరిస్తున్న తీరు చర్చనీయాంశమైంది. అసెంబ్లీ సమావేశమైన తొలి రోజున ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రొటోకాల్ వివాదంపై సభ దృష్టికి తీసుకొచ్చారు. కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి సైతం ఇదే అంశంతో పాటు ఇతరత్రా సమస్యలను లేవనెత్తారు. బీజేపీ ఎమ్మెల్యేలు మాట్లాడేందుకు సభాపతి అవకాశం కల్పించడంతో పాటు వారిని ఎక్కడా పోలీసులు అడ్డుకోలేదు. కానీ, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను సభలోకి అనుమతిస్తే తమ తప్పులను ఎత్తి చూపి నిప్పులు చెరుగుతారనే భయంతో ప్రభుత్వం అక్రమ నిర్బంధాలకు తెరలేపింది.

## మాజీ సర్పంచుల అరెస్టు..

రాజధానిలో స్వయంగా అసెంబ్లీ ఎదుటే ప్రజాస్వామ్య విలువలను కాలరాసిన సర్కారు.. ఉమ్మడి జిల్లాలోనూ అలాగే వ్యవహరించింది. మాజీ సర్పంచులను సోమవారం ఎక్కడికక్కడ అరెస్టు చేశారు. పెండింగ్ బిల్లుల కోసం మాజీ సర్పంచులు ఎన్నిసార్లు విన్నవించినా రేవంత్ సర్కారు స్పందించలేదు. దీంతో చలో అసెంబ్లీకి పిలుపునిచ్చారు. అయితే, ప్రభుత్వం మాజీ ప్రజాప్రతినిధులు గడప దాటకుండా పోలీసులతో ఎక్కడికక్కడ కట్టడి చేసింది. అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు గ్రామాల్లోకి వచ్చిన పోలీసులు మాజీ సర్పంచులను అదుపులోకి తీసుకున్నారు. నిద్ర పోతున్న వారిని సైతం లేపి మరీ ఠాణాలకు తీసుకెళ్లారు. మరికొందరిని గృహ నిర్బంధం చేశారు. సర్కారు నిరంకుశ వైఖరిపై మాజీ ప్రజాప్రతినిధులు మండిపడ్డారు. ఇందిరమ్మ రాజ్యమంటే ఆంక్షలు విధించడమేనా? అక్రమంగా నిర్బంధించడమేనా? అని ప్రశ్నించారు. రౌడీమూకలను, సంఘ విద్రోహులను అరెస్టు చేసినట్లు తమను అరెస్టు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రులుగా చలామణి అవుతున్న బడా కాంట్రాక్టర్లకు వేల కోట్లు బిల్లులు మంజూరు చేస్తున్న రేవంత్ ప్రభుత్వం తమను కావాలనే నిర్లక్ష్యం చేస్తున్నదని మండిపడ్డారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా దాదాపుగా రూ.150 కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లుగా సమాచారం.

బోధన్ రూరల్ పోలీస్‌స్టేషన్ ఎదుట సర్పంచుల నిరసన





ఎస్ఎస్ఏ ఉద్యోగులు చేస్తున్న నిరాహార దీక్షకు సంఘీభావం తెలిపి మాట్లాడుతున్న ఆర్టీసీ మాజీ చైర్మన్, రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

# 'సమగ్ర' న్యాయం చేయాలి

- రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ డిమాండ్
- సమగ్ర శిక్ష ఉద్యోగుల దీక్షకు సంఘీభావం

కంఠేశ్వర్/ ఖలీల్‌వాడి, డిసెంబర్ 9 : సమగ్ర శిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ) ఉద్యోగులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని, వారికి న్యాయం చేయాలని నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధన కోసం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో మూడు రోజులుగా ఎస్ఎస్ఏ ఉద్యోగులు నిరాహార దీక్షలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బాజిరెడ్డి సోమవారం వారి వద్దకు వెళ్లి సంఘీభావం ప్రకటించారు. సమగ్ర శిక్ష ఉద్యోగులను రేవంత్ ప్రభుత్వం వెంటనే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. మహిళా సిబ్బందికి వేతనంతో కూడిన 180 రోజుల ప్రసూతి సెలవులు ఇవ్వాలన్నారు. మరోవైపు, తమ సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళన కార్యక్రమాలను ఆపబోమని ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజు స్పష్టంచేశారు.

### నేటి నుంచి సమ్మె..

మంగళవారం నుంచి పూర్తిస్థాయి సమ్మె చేయనున్నట్లు సమగ్ర శిక్ష ఉద్యోగులు తెలిపారు. ఈ మేరకు సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్‌ను కలిసి సమ్మె సమాచారమిచ్చారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల రెగ్యులరైజేషన్ సాధన కోసం రిలే నిరాహార దీక్షలు చేపట్టినా ప్రభుత్వం నుంచి స్పందన లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం తమ డిమాండ్లు నెరవేర్చే వరకు సమ్మె విరమించేది లేదని స్పష్టంచేశారు.

# విగ్రహ మార్పు కక్షసాధింపే..



కామారెడ్డి జిల్లా కేంద్రంలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

- బీఆర్ఎస్ నేతల ఆగ్రహం
- కామారెడ్డిలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం

కామారెడ్డి, డిసెంబర్ 9 : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై కక్షసాధింపు చర్యల్లో భాగంగానే సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ తల్లి విగ్రహ రూపురేఖలు మార్చారని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. విగ్రహ రూపురేఖలు మార్చినందుకు నిరసనగా కామారెడ్డి జిల్లా కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి సోమవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతూ.. తెలంగాణ తల్లితో రాజకీయం చేయడం సిగ్గుచేటన్నారు. రేవంత్ దుశ్చర్యలను ప్రజలు గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో గట్టి బుద్ధి చెబుతారని హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి ఇకనైనా తన ప్రవర్తన మార్చుకుని, ప్రజలకు ఉపయోగపడే అంశాలపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ దశరథ్‌రెడ్డి, నేతలు భూంరెడ్డి, నజీరుద్దీన్, లక్ష్మీనారాయణ, కృష్ణాజీరావు, స్వామి, భానుప్రసాద్, అనంతరాములు, జగదీశ్ యాదవ్, మల్లేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

# నియంతపాలనకు అరెస్టులే నిదర్శనం

ఖలీల్‌వాడి, డిసెంబర్ 9 : రాష్ట్రంలో నియంత పాలన కొనసాగుతున్నదని, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సహా రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న అరెస్టులే అందుకు నిదర్శనమని నిజామాబాద్ జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అసెంబ్లీకి వెళ్లకుండా పోలీసులతో అడ్డుకోవడం దారుణమన్నారు. తెలంగాణ తల్లి విగ్రహ మార్పు చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి పార్టీ నేతలు సోమవారం క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం విలేకరులతో విఠల్‌రావు మాట్లాడుతూ.. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ సర్పంచుల అక్రమ అరెస్టులను ఖండించారు. నిర్బంధాలతో బీఆర్ఎస్‌ను ఆపలేరని, తెలంగాణలో తమ ఉధృతిని తట్టుకోవడం కాంగ్రెస్ తరం కాదని హెచ్చరించారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ నవంబర్ 29న ప్రారంభించిన ఆమరణ దీక్ష దేశం మొత్తాన్ని కుదిపేసిందన్నారు. దీంతో కేంద్రం దిగివచ్చి, రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తున్నామని ప్రకటించిందన్నారు. రాష్ట్ర అవతరణకు పునాది వేసిన డిసెంబర్ 9వ తేదీని విజయ్ దివస్‌గా జరుపుకుంటున్నామని తెలిపారు. కేసీఆర్ మహోన్నత దీక్షాబలాన్ని, అమరుల త్యాగఫలాన్ని సగర్వంగా స్మరించుకుందామని పిలుపునిచ్చారు. సమావేశంలో బీఆర్ఎస్ నేతలు సత్యప్రకాశ్, శంకర్, రాజు, ఫయాం ఖురేషి, శంకర్, భూపతి, మల్లేశం, విజయ్, సాదిక్ తదితరులు పాల్గొన్నారు.


# పెన్షన్ రూ.4,016 ఇవ్వాల్సిందే..

- రుద్రూర్, ఆర్మూర్‌లో బీడీకార్మికుల ర్యాలీ
- తహసీల్దార్లకు వినతిపత్రాల అందజేత

రుద్రూర్ / ఆర్మూర్ టౌన్, డిసెంబర్ 9 : కాంగ్రెస్ ప్రభుత్వం బీడీ కార్మికుల సమస్యలను పరిష్కరించడంతో పాటు ఇచ్చిన హామీ మేరకు నెలకు రూ. 4,016 పెన్షన్ అందజేయాలని బీడీ కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు రుద్రూర్ మండల కేంద్రం, ఆర్మూర్ పట్టణంలో తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ల ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీలు నిర్వహించి, తహసీల్ కార్యాలయాల వద్ద నిరసనలు తెలిపి, వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీడీ కార్మికులకు చేతినిండా పని దొరకడం లేదని, నెలకు 8 నుంచి 12 రోజుల పని మాత్రమే దొరుకుతున్నదని, వేతనాలు కూడా తక్కువగా ఉన్నాయని వాపోయారు. బీడీ కార్మికులకు రూ.4,016 పెన్షన్ ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి ఏడాది కావస్తున్నా నేటికీ అమలు కావడం లేదన్నారు. రుద్రూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశ్, ఆర్మూర్‌లో యూనియన్ నాయకుడు ముత్తెన్న, బీడీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.




రుద్రూర్ తహసీల్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న బీడీ కార్మికులు



లింగంపేట మండల కేంద్రంలో కమ్ముకున్న దట్టమైన పొగమంచు

# మంచు దుప్పటి

ఎల్లారెడ్డి పట్టణంతోపాటు లింగంపేట మండల కేంద్రాన్ని సోమవారం ఉదయం దట్టమైన పొగమంచు కమ్మేసింది. ఉదయం 7.30 గంటలు అయినా సూర్యుడు మంచు దుప్పటి చాటునే ఉన్నాడు. పొగమంచు కారణంగా ఎల్లారెడ్డి ప్రధాన రహదారి కనిపించకపోవడంతో రెండు గంటల పాటు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. హెడ్‌లైట్ల వెలుతురులో నెమ్మదిగా ప్రయాణించాల్సి వచ్చింది. లింగంపేట మండల కేంద్రంతోపాటు చుట్టుపక్కల గ్రామాలను మంచు దుప్పటి కమ్మేసింది. ప్రకృతి ప్రేమికులు ఈ ఆహ్లాదకర వాతావరణాన్ని ఆస్వాదించారు.

– ఎల్లారెడ్డి రూరల్/ లింగంపేట, డిసెంబర్ 9



ఎల్లారెడ్డి రహదారిపై కమ్ముకున్న పొగమంచు

